క్లుప్తంగా

నేటి నుంచి బీరప్ప ఆలయ ఉత్సవాలు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామంలో బీరప్ప ఆలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలకు ముస్తాబైంది. అక్కమహాంకాళి, కామరాతి సమేత బీరప్ప సహిత, నందీశ్వర, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలను ఈ నెల 10 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని సూచించారు.

నియామకం


సుధీర్ బండారీ

జహీరాబాద్ టౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జహీరాబాద్ పట్టణానికి చెందిన సుధీర్ బండారీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం సుధీర్ బండారీ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలు చేస్తున్నందుకు తనకు ఈ పదవి దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఓబీసీ రాష్ట్ర కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఎంపీ బీబీపాటిల్ నియోజకవర్గ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీలో చేరిక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రాఘవేందర్ రెడ్డి మంగళవారం బీజేపీలో చేరారు. రాఘవేందర్ నివాసానికి వచ్చిన మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో...

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల బీఆర్‌ఎస్ నాయకుడు, జెడ్పీటీసీ రాజురాథోడ్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ అధికార ప్రతినిధి జనవాడె సంగప్ప ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: ఖేడ్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలో ఉత్సవ కమిటీ బాధ్యులు ఆవిష్కరించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ప్రదర్శనతో పాటు అంబేడ్కర్ చౌక్‌లో ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వివరిస్తూ నియోజకవర్గంలోని విద్యార్థులు, యువకులు, మేధావులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ బాధ్యులు పిలుపునిచ్చారు.

ఘనంగా పోచమ్మ జాతర

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో ఉగాది సందర్భంగా మంగళవారం మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సంప్రదాయ బద్ధంగా ఉత్సవ కమిటీ బాధ్యులు బాజా భజంత్రీలతో ఆలయానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. రాత్రి బోనాల ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ శంకర్, ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత


రంజాన్ తోఫాను అందజేస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ఎండీఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లాను స్మరిస్తూ నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కఠిన ఉపవాసాలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాది రంజాన్ తోఫాను అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. పేద ముస్లిం మహిళలకు చీరలను కూడా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎండీఆర్ అధ్యక్షుడు మధు, సభ్యులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామం నుంచి పొట్టిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన పైప్‌లైన్, కేబుల్ కనెక్షన్ మరమ్మతులో భాగంగా గుంతలను తవ్వి వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. కానీ.. గుంతలను పూడ్చకుండా వదిలేశారు. దీంతో వాహనదారులు గుంతలో పడే ప్రమాదం ఉంది. గుంతలను పూడ్చివేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ఝరాసంగం(జహీరాబాద్)

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పొలాలకు వెళ్లేదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కలివేములకు చెందిన రైతు మల్లారెడ్డి తన పంటపొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చిమ్నాపూర్ తండాలో జనవాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మూడు అడుగుల ఎత్తులో మాత్రమే ఏర్పాటు చేశారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– కంది(సంగారెడ్డి)

ఈతకు వెళ్లొద్దు



ఈతకు వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. త్వరలో విద్యార్థులకు పరీక్షలు ముగియనున్నందునా వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువకులు ఈత కోసం చెరువు వద్దకు రాకుండా ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు స్థానిక చెరువు వద్ద మనూరు ఎస్‌ఐ అంబ్రునాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెచ్చరిక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో చెరువులో జేసీబీతో గుంతలు తీసినందునా ఈతకు వెళ్లొద్దన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, గ్రామస్తులు గమనించాలని సూచించారు. ఎవరైనా ఈతకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– నారాయణఖేడ్

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేనా!

- ప్రధాన ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
- పలుచోట్ల ప్రమాదకర టర్నింగ్‌ల గుర్తింపు
- పెరుగుతున్న వాహనాల రద్దీతో తప్పని ఇబ్బందులు


ఏలియాన్స్ చౌరస్తా

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వాహనాల రద్దీ రోజురోజుకు అధికమవుతుండటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

రామచంద్రాపురం పట్టణంలో వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోల్ డేవిస్‌ను కలిసి వినతిపత్రం సైతం అందజేశారు. దీంతో స్పందించిన ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పోలీసు అధికారులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు.

ప్రమాదకరంగా మలుపులు

పట్టణ పరిధిలోని శేరిలింగంపల్లి గోపనపల్లి, తెల్లాపూర్ మీదుగా రింగ్ రోడ్డు వరకు, శేరిలింగంపల్లి నలగండ్ల నుంచి తెల్లాపూర్ ఇందిరానగర్‌కాలనీ మీదుగా రింగ్ రోడ్డు వరకు ప్రమాదకరంగా ఉన్న నాలుగు మలుపులు గుర్తించారు. అదేవిధంగా సాయిబాబా ఆలయం సమీపంలో వాహదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు.

వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు

రామచంద్రాపురం పరిధిలోని ఎలియాన్స్, రాజుపుష్ప సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్‌జాక్‌లో బారికేడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా ప్రజలందరి భాగస్వామ్యంతో 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



తెల్లాపూర్, నల్లగండ్ల పరిధిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నాం. ట్రాఫిక్ సమస్యలను అరికట్టేందుకు అవగాహన కల్పిస్తున్నాం.

– పవన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం


జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

జోగిపేట(అందోల్): ఎండలు మండుతున్న సమయంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి సేవా సమితి సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. జోగిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లని మినరల్‌వాటర్, మజ్జిగను ప్రయాణికులకు పంపిణీ చేశారు. 2 నెలల పాటు ప్రతిరోజు ఉచితంగా మినరల్‌వాటర్, మజ్జిగ, అంబలి పంపిణీ చేస్తామని సత్యసాయి సేవా సమితి బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యప్రకాష్, ఆర్టీసీ కంట్రోలర్ తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం మండల కేంద్రంలో...

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌వు పాటిల్, పాస్టర్ ప్రభుదాస్‌తో కలిసి మండల కేంద్రంలోని చర్చి ఆవరణలో మంగళవారం చలివేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటుతో రహదారిపై రాకపోకలు సాగించేవారికి దాహార్తి తీరేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చర్చి సంఘం సభ్యులు రవి, సంగమేశ్వర్, జైపాల్, అమృత్, షకీల్, సామ్యూల్, రాజు, సురేష్, సంగప్ప పాల్గొన్నారు.

నగర సంకీర్తన బృందం సభ్యుల ఆధ్వర్యంలో...

జహీరాబాద్ టౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నగర సంకీర్తన బృందం సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని రతన్ మెడికల్ వద్ద.. అదేవిధంగా మండల పరిధిలోని హుగ్గెల్లిలో మంగళవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరేరామ హరేకృష్ణ సంస్థ సభ్యులు డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అన్నారు. వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం పుణ్యకార్యమని తెలిపారు. కార్యక్రమంలో నగర సంకీర్తన సభ్యులు రతన్ సరదా పాల్గొన్నారు.


ఝరాసంగం: చలివేంద్రంను ప్రారంభిస్తున్న నాయకులు


జోగిపేట: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు

నారాయణఖేడ్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్‌ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సైతం ఎన్‌ఎస్‌యూఐలో పనిచేసి ఎదిగారన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఖేడ్ నియోజకవర్గశాఖ అధ్యక్షుడు కొంగరి దిలీప్ రెడ్డి, కౌన్సిలర్లు వివేకానంద్, హన్మండ్లు, నాయకులు సుధాకర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, బీరప్ప, ప్రశాంత్, ఇంతియాజ్, పండరిరెడ్డి పాల్గొన్నారు.

వట్‌పల్లి మండల కేంద్రంలో...

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లిలో మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రావు, యువజన నాయకులు ఇస్మాయిల్, రాందాస్, గోపాల్, వినయ్, ప్రభు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


వట్‌పల్లిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

జహీరాబాద్‌లో...

జహీరాబాద్: ఎన్‌ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ వేడుకలను జహీరాబాద్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్టేట్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి హాజరై కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, ముబీన్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీకాంత్‌రెడ్డి, నందకిషోర్, నవీద్, సన్నిరెడ్డి, లాలుప్రసాద్, అంజియాదవ్ పాల్గొన్నారు.

గుమాస్తా సంఘం నూతన కమిటీ ఎన్నిక

జహీరాబాద్: పట్టణంలోని సుభాష్‌గంజ్ గుమాస్తా వర్కర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా రవికుమార్, మల్లేష్, వర్కింగ్ అధ్యక్షుడిగా శరణప్ప, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా జగదీశ్వర్, ముఖ్య సలహాదారుగా రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది

జిల్లావ్యాప్తంగా తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శోభకృత్ నామ సంవత్సరానికి స్వస్తి చెప్పి క్రోధి నామ సంవత్సరంలోకి అడుగు పెట్టడం శుభదాయకంగా భావిస్తారు. ప్రజలందరూ సుఖసౌభాగ్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు.


పటాన్‌చెరు: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు


పటాన్‌చెరు టౌన్: గణేష్ గడ్డ ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


సంగారెడ్డి చౌరస్తాలోని సంగమేశ్వరాలయంలో పచ్చడి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు


వట్‌పల్లి(అందోల్): పోతులబోగుడలో వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్న రైతు


జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో...


నారాయణఖేడ్: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ బాధ్యులు


సంగారెడ్డి టౌన్: శివాలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పూజారి


రామచంద్రాపురం: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప, నాయకులు


హత్నూర: శివాలయంలో


ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ ఆలయంలో..

సంక్షిప్త వార్తలు

◆ సీపీఎం నాయకుడు ప్రకాష్ మృతి

జహీరాబాద్ టౌన్: సీపీఎం నాయకుడు ప్రకాష్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం మొగుడంపల్లి మండలంలోని గుడ్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా నాయకులు మల్లేష్, మాణిక్, నర్సింలు, రాంచందర్, మహిపాల్, యాదగిరి, చంద్రన్న, శ్రీనివాస్, కొడి నర్సింహులు, మహేష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

◆ గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

నారాయణఖేడ్: మండల పరిధిలోని హంక్రాన (జి) గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, తాజా మాజీ సర్పంచ్ బారి ఆశీర్వాదం మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో హంక్రాన (జి) సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆశీర్వాదం మృతదేహానికి నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, ఖేడ్ నియోజకవర్గ టీఎన్జీవోస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తాహెర్, అశోక్, ముంతాజ్ కలిసి ఆశీర్వాదం మృతదేహానికి నివాళులు అర్పించారు.

◆ బీజేపీ శ్రేణుల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మంగంపేట, ఊట్ల, దాదిగూడెం గ్రామాల్లో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ముస్లింలకు దుస్తుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముస్లింలకు జెడ్పీటీసీ మహేశ్ గుప్తా మంగళవారం దుస్తులు అందజేశారు. మగ్దుంపూర్, గంగాయిపల్లి తదితర గ్రామాలకు చెందిన ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ పురస్కరించుకొని దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పవన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, దేవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400